# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-09-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖలపై ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- ❖ ఇటీవల రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాలు, వరదలను జాతీయ విపత్తుగా పరిగణించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు.
- ❖ "స్వచ్ఛతా హి సేవా" పక్షోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి.
- ❖ ప్రకాశం బ్యారేజ్ వద్ద పడవల తొలగింపు ప్రక్రియ స్కూబా డ్రైవర్స్ సహాయంతో కొనసాగుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

========================

ఉపాధి కల్పనలో కీలకమైన సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు ఆయన సచివాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన పూర్తి చేసి పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేస్తామన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమకు రాష్ట్రంలో అపార అవకాశాలు, అనువైన పరిస్థితులు ఉన్నాయని... ఈ రంగాన్ని ఎంఎస్ఎంఈ లతో అనుసంధానం చేసి గ్రామాల్లో ప్రోత్సాహించేలా విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

ఈ సమీక్ష అనంతరం రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 36 సెకన్లు)

========================

రాష్ట్రంలో ఇటీవల సంబంవించిన భారీ వర్షాలు, వరదలను జాతీయ విపత్తుగా పరిగణించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర హోం శాఖ జాయింట్ సెక్రటరీ అనిల్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని కేంద్ర బృందం గత రెండు రోజులుగా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. అనంతరం ఈ బృందం సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి... పంట నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం జరిగిందని కేంద్ర బృందానికి వివరించి, జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు.

=======================

స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జీవన విధానంగా అలవరచుకోవాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వివిధ జిల్లాల కలెక్టర్లు గ్రామీణ తాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఈరోజు దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించి ఈ నెల 14 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న 10వ విడత స్వచ్ఛత హి సేవ కార్యక్రమ నిర్వహణపై దిశా నిర్దేశం చేశారని కలెక్టర్ తెలిపారు. నగరాలు, పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే లక్ష్యంతో “స్వచ్ఛత హి సేవా” పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

=======================

విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద పడవలను తొలగించే ప్రక్రియ గత రెండు రోజులుగా కొనసాగుతోందని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈరోజు ఆయన విజయవాడలో పాత్రికేయులతో మాట్లాడుతూ... పడవల బరువు అధికంగా ఉండడంతో వాటిని తొలగించడం సమస్యగా మారిందన్నారు. ఈ కారణంగా పడవలను ముక్కలుగా విభజించి పైకి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. స్కూబా డ్రైవర్స్ నీటిలో 12 అడుగుల లోతుకు చేరి పడవలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

=======================

గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్రికెట్ స్టేడియాంను అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు వీలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. ఈరోజు మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. విశాఖలో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ మైదానంతో పాటుగా మరో మైదానాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే మంగళగిరి క్రికెట్ స్టేడియంలో క్రీడాకేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించనున్నామని కేశినేని శివనాథ్ ఈ సందర్భంగా వివరించారు.

=======================

వరద ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలియజేశారు. ఈరోజు విజవాడలో స్థానిక శాసనసభ్యులతో కలిసి మంత్రి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పాయకాపురం, ఉడా కాలనీ, జర్నలిస్టు కాలనీ, కండ్రిక, అంబాపురంలో బాధితులను పరామర్శించి, వారికి అందుతున్న సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఒకటి, రెండు డివిజన్లలో వరద నీరు నిల్వ ఉందని, నీటిని బయటకు మళ్లించడానికి చేసేందుకు అవసరమైన చోట్ల రోడ్లకు గండ్లు కొడుతున్నామని అన్నారు. అన్ని డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలు దాదాపు పూర్తి కావస్తున్నాయని మంత్రి తెలిపారు.

విరామం

=======================

కేంద్ర ప్రభుత్వ పోషణ్ అభియాన్ పథకం కింద తిరుపతి జిల్లాలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి శాంతి దుర్గ... తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు పంచాయతీ ముద్దిమాడు గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గర్భిణీలు, చిన్నారుల సంపూర్ణ పోషణ కోసం భారత ప్రభుత్వం విస్తృతమైన ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లుల కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని, ఈ నెల 30వ తేదీ వరకు కార్యక్రమాలను కొనసాగిస్తామని వివరించారు.

=======================

రైతులతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని అల్లూరి సీతారామరాజు  జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. నాబార్డు ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి దారుల గ్రూపులతో ఈరోజు జరిగిన సమాశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వం నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను పరిరక్షించాలని, గిరిజనుల ఆర్థిక పరిస్థితులు మెరుగు పడాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వ్యాఖ్యానించారు.

=======================

భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అనారోగ్య కారణాలతో కొద్ది సేటిక్రితం మరణించారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో గత కొన్ని వారాలుగా ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సామాజిక కార్యకర్తగా, ఆర్థికవేత్తగా సేవలు అందించిన  72 సంవత్సరాల సీతారాం ఏచూరి 2005లో పశ్చిమ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యి, 2017 వరకు కొనసాగారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఎం మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యి, అప్పటి నుండి ఆ పదవిలో కొనసాగుతున్నారు.

=======================

తూర్పు కోస్తా రైల్వే జోన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 100 మిలియన్ టన్నుల వస్తు రవాణా చేసిందని రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరం సెప్టెంబర్ 7వ తేదీ నాటికి, తూర్పు కోస్తా రైల్వే జోన్ గత సంవత్సరం కంటే 6.15 మిలియన్ టన్నులు అధికంగా... 100.44 మిలియన్ టన్నులను విజయవంతంగా అన్‌లోడ్ చేసిందని, ఈ జోన్ లోని ఖుర్దా రోడ్ డివిజన్ 60.38 మిలియన్ టన్నులు వాల్తేరు డివిజన్ 22.68 మిలియన్ టన్నులు, సంబల్‌పూర్ డివిజన్ 17.38 మిలియన్ టన్నులు అన్‌లోడ్ జరిగిందని రైల్వే వర్గాలు తెలిపాయి. కాగా పారాదీప్, విశాఖపట్నం, గంగవరం, గోపాల్‌పూర్,  ధామ్రాతో సహా ప్రధాన ఓడరేవులకు, ఉక్కు, విద్యుత్, పటిక వంటి పరిశ్రమల రవాణా అవసరాలకు తూర్పు కోస్తా రైల్వే పూర్తి సహకారాన్ని అందిస్తోంది.

=======================

మాతా శిశు మరణాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గర్భిణులకు అధిక రక్తపోటు, రక్తహీనత, పౌష్టికాహార లోపం,  కాన్పు సమయంలో సంభవించే మరణాలను వైద్యాధికారులు ముందస్తు ప్రణాళికల ద్వారా నివారించాలన్నారు. గర్భిణీలకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, గ్రామ

స్థాయిలో హైరిస్క్ గర్భవతులకు అన్నీ పరీక్షలు నిర్వహించాలన్నారు. కాన్పుకు వారం రోజులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన వారికి ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

========================

పాఠశాల ప్రత్యేక అధికారులు పాఠశాలలను విధిగా సందర్శించి చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయం నుండి "మై స్కూల్-మై ప్రైడ్" కార్యక్రమంపై పాఠశాల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి ఉన్నతాధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించి మెరుగైన ఫలితాలు సాధించేలా సూచనలు చేయాలన్నారు.

========================

========================